గ్రూప్–1 అభ్యర్థుల వసతి కేంద్రం సందర్శన



అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్, సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్‌లో వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రూప్–1 మెయిన్స్ అభ్యర్థులకు ఏర్పాటు చేసిన వసతి కేంద్రాన్ని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి పరీక్ష రాయడానికి వచ్చిన గ్రూపు–1 మెయిన్స్ అభ్యర్థులకు భోజనంతో పాటు వసతి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, మాజీ సర్పంచ్ కావేరి, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సన్‌రైజ్ చారిటబుల్ సభ్యులు

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీనగర్ దత్తాత్రేయ నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్ సత్యనారాయణ రోడ్డు ప్రమాదంలో గాయపడి 10 నెలలుగా మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నాడు. ఇంటిపెద్ద ఉలుకూ పలుకు లేకుండా మంచంలో ఉండడంతో ఇల్లు గడవడం కష్టమైపోయింది. విషయం తెలుసుకున్న ఎన్‌ఎఫ్‌సీనగర్ సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కుటుంబీకులకు ఆదివారం రూ. 10 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సుందర్‌రావు, శ్రీకాంత్, వీరారెడ్డి, ఐలయ్య, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్‌చారి

జవహర్‌నగర్: ఉద్యమకారుల బంధువుగా సీఎం రేవంత్‌రెడ్డి మారి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు సుధాకర్‌చారి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌చారి మాట్లాడుతూ.. సాంస్కృతిక సారథిలో ఉద్యమకారులకు ఉద్యోగాలు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లలో 10 శాతం వాటా ఉద్యమకారులకు కేటాయించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరశురాం, ప్రకాష్, బాలరాజు, వెంకటేష్‌గౌడ్, నర్సింహా, భాస్కర్, మహేష్, కృష్ణయాదవ్, రమేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలి



ఘట్‌కేసర్: అంబేడ్కర్ రచనలు చదివి నేటి యువత జ్ఞానవంతులు కావాలని కౌన్సిలర్ శశికళదేవేందర్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ బాధ్యుడు మీసాల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్ 18 డిగ్రీలు చదివి ప్రపంచంలోనే మేధావిగా ఖ్యాతికెక్కాడని, ఆయన జీవితాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాసు, లక్ష్మారెడ్డి, రాందాసు, ఆంజనేయులుపంతులు, రాధాకృష్ణ ముదిరాజ్, దేవేందర్ ముదిరాజ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జినోమ్‌వ్యాలీ సీఐగా వెంకట్‌రెడ్డి



శామీర్‌పేట్: జినోమ్‌వ్యాలీ ఎస్‌హెచ్‌ఓగా సీఐ వెంకట్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మేడ్చల్ డీఐగా 9 నెలలు విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్‌కు వచ్చినట్లు ఆయన తెలిపారు.

అనుమతి లేకుండా డీజే వినియోగించిన రిసార్ట్స్‌పై కేసు

ఘట్‌కేసర్: అనుమతి లేకుండా డీజే వినియోగించిన రిసార్ట్స్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్‌లోని కాంటినెంట్ రిసార్ట్స్‌లో డీజే పెట్టి డ్యాన్స్ చేస్తూ న్యూసెన్స్ చేస్తున్నారని స్థానికులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కాంటినెంట్ రిసార్ట్స్ చేరుకొని విచారణ చేపట్టారు. రిసార్ట్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్న వరుణ్, వికాస్, డీజే యజమాని అంజన్‌కుమార్, ఆపరేటర్ సుధీర్, కాంటినెంట్ రిసార్ట్స్ యజమాని ఆకాష్‌పై కేసు నమోదు చేసి డీజే సిస్టమ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా పోలీస్ అమరవీరుల వారోత్సవ ర్యాలీ

ఘట్‌కేసర్: పోలీస్ అమరవీరుల వారోత్సవాన్ని ఘట్‌కేసర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం, డీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు అమరవీరుల చిత్రాలు చేతబట్టి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తమ ప్రాణాలు అర్పించి అమరులైన పోలీసులకు నివాళులర్పిస్తు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, శేఖర్, విద్యార్థులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.





సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్‌ఐలు

ప్రజా రక్షణలో పోరాడేది పోలీసులే– ఇన్‌స్పెక్టర్ సైదులు

జవహర్‌నగర్: పోలీస్ అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకొని జవహర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య ఆధ్వర్యంలో ఆదివారం కార్పొరేషన్‌లోని ఫైరింగ్ కట్ట నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. ప్రజా రక్షణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుండి పోరాడేది పోలీసులేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్‌ఐ ఇద్రీస్ అలీ, ఎస్‌ఐలు రామునాయక్, లక్ష్మయ్య, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



కార్పొరేటర్ దంపతులను సత్కరిస్తున్న కాలనీవాసులు

బోడుప్పల్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు 24వ డివిజన్ కార్పొరేటర్ గుర్రాల రమా వెంకటేష్‌యాదవ్ అన్నారు. జ్యోతినగర్ కాలనీవాసులు ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్యోతినగర్‌లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం పనిచేసినట్లు వివరించారు. రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సమస్యలు, పార్కుల అభివృద్ధి, సీసీ కెమెరాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం కృషి చేసినట్లు తెలిపారు. అనంతరం కాలనీవాసులు కార్పొరేటర్ దంపతులను సత్కరించారు.

నూతన కమిటీ ఎన్నిక

బోడుప్పల్: ఆర్ఎన్ఎస్ కాలనీ ఫేస్ – 3 వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రాజు, అధ్యక్షుడిగా నర్సింగ్ సేన, ప్రధాన కార్యదర్శిగా వీరభతిని ప్రదీప్, కోశాధికారిగా సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా మనోజ్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా శంకర్ లాల్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ ప్రతినిధులు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్‌ను ఆదివారం కలిసి తమ కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.



మేయర్ అజయ్‌యాదవ్‌తో కమిటీ ప్రతినిధులు

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

ఉప్పల్/రామంతాపూర్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నృత్య నాట్య గురువు రమేష్ దేవరకొండ శిష్య బృందంచే నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహుతులను అలరించింది. కౌతం, జతిస్వరం, అన్నమయ్య సంకీర్తన, భామా కలాపం, పరులన్న మాట.– జావలి, బృందావన నిలయేహి, భోశంభో తదితర అంశాలను పావని, పూర్ణిమ, వేదం, గాయత్రి, మహమ్మద్ అలీఫ్ లైలా, ప్రమీల, షాలిని తదితరులు ప్రదర్శించి మెప్పించారు.

ఘనంగా ఓరియంటేషన్ డే

మేడిపల్లి: పీర్జాదీగూడ అరోరా పీజీ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మోటివేషనల్ స్పీకర్, సినీఆర్టిస్ట్ కొంపల్లి ప్రదీప్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జీవితంలో ఆర్థికంగా ఎదగాలంటే ప్రణాళికాబద్ధంగా నడుచుకుని, దీక్షతో పనిచేయాలని సూచించారు. ప్రాక్టీస్ హెడ్ అండ్ డేటా ఏఐ లలితాకిషోర్ నారాయణ, డా.రమేష్‌బాబు, డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల, అరోరా కాలేజ్ చైర్మన్ అనుదీప్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.



సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే



గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకల్లో తాతయ్య, అమ్మమ్మలు

బోడుప్పల్: బోడుప్పల్ శుభోదయ కాలనీలోని బచపన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఆహుతులను అలరించాయి. ఈ వేడుకల్లో గ్రాండ్ పేరెంట్స్, వారి మనమళ్లు, మనమరాళ్లతో పాల్గొని రకరకాల వినోదాత్మక ఆటపాటల్లో పాల్గొని సందడి చేశారు. గ్రాండ్ పేరెంట్స్ వారి అనుభవాలను చిన్నారులతో కలిసి పంచుకున్నారు. తాతయ్య, అమ్మమ్మ, నానమ్మ, పిల్లలకు అందించే జ్ఞానం, ప్రేమ, మార్గదర్శకత్వాన్ని గురించి వివరించారు. చిన్నారులకు ఆనందాన్ని పంచేందుకు ఈ కార్యక్రమం ఓ వేదికగా మారిందన్నారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులను ప్రదానం చేసింది.

బచ్‌పన్ స్కూల్ లో..

మేడిపల్లి: బచపన్ అకడమిక్ హైట్స్ స్కూల్ మేడిపల్లిలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాతలు, నాయినమ్మలు, అమ్మమ్మలు వారి చిన్నారులతో పాఠశాలకు చేరుకుని వివిధ ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొని సందడి చేసి ఆనందించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్ తమ అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. రీజనల్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, డైరెక్టర్ రూపారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి, రీజనల్ కో– ఆర్డినేటర్ సుష్మ, పాఠశాల ప్రిన్సిపాల్ అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.



మేడిపల్లి బ్రాంచ్ బచ్‌పన్ స్కూల్ వేడుకల్లో..

వైభవంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు



పూజా కార్యక్రమాల్లో ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కీసర: చీర్యాలలోని రామాలయంలో విఘ్నేశ్వర, నాగదేవత, ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పూజకార్యక్రమాల్లో మాల్కాజ్‌గిరి ఎంపీ ఈటలరాజేందర్ పాల్గొన్నారు. జిల్లాల తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భక్త బృందం గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



కీసర: కీసరలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుండే భక్తులు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

యువత రక్తదానం



రక్తదానం చేస్తున్న స్ట్రీట్ కాస్ క్లబ్ సభ్యులు, విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ కళాశాలలో స్ట్రీట్ కాస్ ఎన్జీవో క్లబ్ స్టూడెంట్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి శిబిరాన్ని ప్రారంభించగా సీఎంఆర్ ఆసుపత్రి సహకారంతో క్లబ్ యువత, విద్యార్థులు రక్తదానం చేశారు. సీఎంఆర్ ఆసుపత్రిలో వైద్యం పొందే పేదలకు అండగా నిలిచేందుకు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుసూదన్‌రావు, డైరెక్టర్ అలీబేగ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మల్లాపూర్: నాచారం ఇందిరానగర్‌లోని నల్లపోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ మహోత్సవానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యేలు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, బేతి సుభాష్‌రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మల్లెల నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో 600 మందికి అన్నప్రసాద వితరణ చేపట్టారు. పాతగాని గోపాల్‌గౌడ్, చంద్రమౌళి, రాజిరెడ్డి, రాగిరి మోహన్‌రెడ్డి, ప్రకాష్, గోపి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఔషధ, సుగంధ మొక్కల సాగుపై శిక్షణ

బోడుప్పల్: బోడుప్పల్‌లోని కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధన సంస్థ ఆవరణలో వచ్చేనెల 12, 14 తేదీల్లో నిమ్మగడ్డ, కాశగడ్డి, అశ్వగంధ తదితర ఔషధ, సుగంధ వాణిజ్య పంటల సాగు, ప్రాసెసింగ్, నాణ్యత, మార్కెటింగ్ అంశాలపై ఇంగ్లిష్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ చీఫ్ సైంటిస్ట్ జీ.డీ.కిరణ్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. నమోదు రుసుం రూ. 3,500, నవంబరు 8వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వయంగా శిక్షణకు హాజరుకావాలన్నారు. సమాచారం కోసం 9491043252,9493408227.

పార్కు అభివృద్ధికి కృషి చేయాలంటూ మంత్రికి వినతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అపెరల్ ఎక్స్‌పోర్ట్ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, అభివృద్ధి చేయాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ నాయకులు ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. నగరంలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు అపెరల్ పార్కు ప్రస్తుత స్థితిని వివరించారు. పార్కులో ప్రస్తుతం కొందరు కంపెనీల ఏర్పాటుకు భూములు తీసుకుని నేటి వరకు ప్రారంభించడం లేదని, కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారి నుంచి ప్రభుత్వం భూములు తిరిగి తీసుకోవాలని గార్మెంట్స్ యూనిట్ ప్రారంభించే కంపెనీలకు అప్పగించాలని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు కావేరి శేఖర్, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌రెడ్డి, నాయకులు దొడ్ల మోహన్, మహిపాల్‌రెడ్డి, నవీన్ తదిదరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా ముగిసిన గ్రూపు పరీక్షలు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులను తణిఖీ చేస్తున్న సిబ్బంది

మేడ్చల్: గ్రూపు–1 పరీక్షలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. జ్ఞానాపూర్ హితం కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయగా అభ్యర్థులు ఆదివారం చివరి రోజు పరీక్షలు రాశారు. మేడ్చల్ సీఐ సత్యనారయణ ఆధ్వర్యంలో పటిష్ట ఏర్పాట్లు చేశారు.

గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికురాలి మృతి

జవహర్‌నగర్: మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న సుగుణమ్మ (56) గుండెపోటుతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ ఆదివారం సుగుణమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం సుగుణమ్మ కుటుంబ సభ్యులకు మేయర్ శాంతి రూ.10 వేలు, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ రూ.5 వేలు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పానుగంటి బాబు, గొడుగు వేణు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మల్లాపూర్: అనేక ఏళ్లుగా రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నాచారం వీఎస్టీ కాలనీవాసుల కోసం రూ.55 లక్షలు మంజూరు చేయించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డికి నాచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బందారం శ్రీకాంత్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం వీఎస్టీ కాలనీలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జి.కృష్ణారెడ్డి, ఎం.రాజిరెడ్డి, హెచ్‌ఆర్ మోహన్, మహేష్‌యాదవ్, రాజు, సంతోష్‌రెడ్డి, చందునాయక్, క్రాంతి, శ్రీధర్, వీఎస్టీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటీ

ఉప్పల్: ఉప్పల్ కురుమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చింతం వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బర్ల కృష్ణ, సలహాదారులుగా గొరిగే రమేష్, రఘు, ఐలయ్య, ఉపాధ్యక్షులుగా హనుమంతు, బాల మహేష్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా మంజుల, సహాయ కార్యదర్శులుగా దేవేందర్, మహేందర్, కోశాధికారిగా పెంటయ్య, కార్యవర్గ సభ్యులుగా సైదులు, సురేష్, నర్సింహ, సాయికుమార్, సత్యనారాయణ, బాలమణి, లత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులు కడకంచి ఎట్టయ్య, కంకల ఎలేందర్ పర్యవేక్షణలో ఎన్నికలను నిర్వహించారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–1 పరీక్షలు




పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు

మల్కాజిగిరి: గత వారం రోజులుగా జరుగుతున్న గ్రూప్ –1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతగా ముగిశాయి. మల్కాజిగిరి ప్రోబుల్స్ పాఠశాలలో రెండు కేంద్రాలు పరీక్షలకు కేటాయించారు. చివరిరోజు మొత్తం 1394 మంది అభ్యర్థులకు 913 మంది హాజరు కాగా.. సెంటర్ 1 లో 133 మంది, సెంటర్ 2లో 348 మంది గైర్హాజరయ్యారు. దివ్యాంగ అభ్యర్థుల్లో 136 మందికి 93 మంది హాజరుకాగా.. సెంటర్ 1లో 7 మంది, సెంటర్ 2లో 26 మంది హాజరుకాలేదు. మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

రామంతాపూర్ : వాగ్దేవి మహిళా డిగ్రీ కళాశాల, మెగా మహిళా డిగ్రీ కళాశాల, స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో ఈనెల 21 నుంచి వరుసగా 7 రోజుల పాటు నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. రామంతాపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రూప్ – 1 పరీక్ష కేంద్రాల్లో పటిష్ట బందబోస్తుతో పాటు 144 సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవడంతో పరీక్షలు ప్రశాతంగా ముగిశాయని పోలీసు అధికారులు ప్రకటించారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక



ఆషిక్‌ను అభినందిస్తున్న మాస్టర్

అల్వాల్: ఎస్‌జీఎఫ్ఐ జాతీయస్థాయి తైక్వాండో పోటీలో తెలంగాణ రాష్ట్రం నుంచి ఇండస్ యూనివర్సల్ స్కూల్ నుంచి బ్లాక్ బెల్ట్ సర్టిఫికేట్ పొందిన తైక్వాండో అథ్లెట్ ఆషిక్ కొప్పాల ఎంపికయ్యాడు. మాస్టర్ నందకిషోర్ ఆధ్వర్యంలో గత ఐదేళ్లుగా ఆషిక్ శిక్షణ పొందుతూ.. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా టోర్నమెంట్‌లలో బంగారు పతకాలు, ఇటీవల గద్వాల్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర టోర్నమెంట్‌లో బంగారు పతకాలు సాధించి ప్రశంసలు పొందాడు.

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ



ప్రథమ స్థానం దక్కించుకున్న ప్రణయ్

ఉప్పల్: జాతీయ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలో ఉప్పల్‌కు చెందిన ప్రణయ్ రాజ్ ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. డబ్ల్యూపీసీ ఇండియా జాతీయ అధ్యక్షుడు దల్జిత్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు ఇంటూరి రేఖ ఆధ్వర్యంలో శంషాబాద్‌లో నిర్వహించిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ – 2024 పోటీలను అక్టోబర్ 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించారు. తెలంగాణ నుంచి అండర్ –19 విభాగంలో పాల్గొన్న ప్రణయ్ 60 కిలోల కేటగిరీ బెంచ్ ప్రెస్‌లో 72.5 కిలోలు డెడ్‌లిఫ్ట్‌లో 155 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387